సాక్షి రంగారెడ్డి

సోమవారం । 15 । మే । 2023



కేసీఆర్ నాయకత్వం అవసరం

సీఎం కేసీఆర్ గొప్ప విజన్ ఉన్న నేత అని మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ అన్నారు. ఆయన నాయకత్వం దేశానికి అవసరమన్నారు. 8లో▸



పంచ్ పడితే పతకమే

జాతీయ, అంతర్జాతీయ కరాటే పోటీల్లో రాణిస్తూ, అందరి చేత శభాష్ అనిపించుకుంటోంది గిరిపుత్రిక సోనియా. 8లో▸

ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత

శంషాబాద్: ప్రయాణికుడు అక్రమంగా తెచ్చిన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రియాద్ నుంచి బయలుదేరిన ఓ ప్రయాణికుడు బహ్రెన్ మీదుగా జీఎఫ్-274 విమానంలో ఆదివారం మధ్యాహ్నం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడు. అతడి లగేజీని తనిఖీ చేసిన అధికారులు అందులో ఉన్న ఎమర్జెన్సీ లైటును పరిశీలించగా బ్యాటరీలో 14 బంగారు బిస్కెట్లను గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్‌రీల్

కిలో చికెన్ రూ.250

ధరలు మరింత పెరిగే అవకాశం



సాక్షి, సిటీబ్యూరో: చికెన్ ధరలు భగ్గుమంటున్నాయి. ఆదివారం కిలో కోడి మాంసం రూ. 250కి చేరింది. ఎండలు మండుతుండటం, వేడి గాలుల తీవ్రతతో ఫారాల్లోని కోళ్లు చనిపోతుండటంతో ఉత్పత్తులు పడిపోయాయి. దీంతో చికెన్ ధరలు ఎగబాకుతున్నాయి. ప్రస్తుతం రిటైల్‌గా కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.250 వరకు విక్రయిస్తుండగా.. స్కిన్‌తో ఉన్న చికెన్ రూ.220 వరకు అమ్ముతున్నారు. గత వారం రోజుల్లో కిలో చికెన్ ధర రూ. 50 నుంచి రూ.60 వరకు పెరిగింది. ఉత్పత్తి తగ్గడం, డిమాండ్ పెరగడమే చికెన్ ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు అంటున్నారు. వచ్చే ఆదివారం నాటికి ధర మరింత పెరిగే అవకాశం ఉందని చికెన్ సెంటర్ల నిర్వాహకులు చెబుతున్నారు. వేసవి సెలవులు, ఫంక్షన్లు ఎక్కువగా జరుగుతుండటంతో చికెన్ వినియోగం బాగా పెరిగి ధరలు మండుతున్నాయి.

అక్రమ నిర్మాణాల కూల్చివేతకు ఆదేశాలు

కబ్జాలపై కన్నెర్ర



గాజులరామారం పరిధిలోని ప్రభుత్వ భూముల్లో ఇలా అక్రమ నిర్మాణాలెన్నో..

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని గాజులరామారం సర్వే నం.307, 308, 329 ,342 ప్రభుత్వ స్థలాలతో పాటు ఎస్‌ఎఫ్‌సీ, హెచ్‌ఎండీఏ, చెరువులు, కుంటలు, బఫర్ జోన్‌ల పరిధిలో అక్రమ నిర్మాణాలపై అధికార యంత్రాంగం కన్నెర్రజేసింది. సుమారు 2500 అక్రమ నిర్మాణాలు ఉన్నట్టు మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ రహస్య విచారణ జరిపించారు. అక్రమాలకు బాధ్యులైన ఆర్ఐ పరమేశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేశారు. ఆర్డీఓ మల్లయ్య, తహసీల్దార్ సంజీవరావు పాత్రపై ఆరా తీస్తున్న నేపథ్యంలో 'జస్ట్ మూడేళ్లు ..ప్రభుత్వ భూముల్లో వేలాదిగా అక్రమ నిర్మాణాలు' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ఈ నెల 13న ఒక కథనం ప్రచురితమైంది. ఈ క్రమంలోనే ప్రభుత్వ స్థలాల్లోని అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ - అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్వింద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో సోమవారం కూల్చివేతలపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉందని మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా అధికారులు చెబుతున్నారు. గాజులరామారం పరిధిలోని ప్రభుత్వ స్థలాలపై కబ్జాదారులు రంగంలోకి దిగి అందిన కాడికి దండుకుని రూ.కోట్లు గడించారు. మేడ్చల్ జిల్లా అధికారుల రహస్య విచారణలో అధికారికంగా రూ.75 కోట్లు.. అనధికారికంగా రూ.375 కోట్ల లావాదేవీలు జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. భూ మాఫియాపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

రండి.. చేరండి



విద్యార్థులు, తల్లిదండ్రులకు మాయమాటలు

- అకడమిక్ క్యాలెండర్ విడుదల కాకముందే అడ్మిషన్లు
- ఫీజుల రూపంలో రూ.లక్షల్లో వసూలు
- ఇంటర్మీడియెట్ కాలేజీల ఇష్టారాజ్యం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అనుమతులు రాక ముందే అడ్మిషన్లు చేపట్టిన ప్రైవేటు యూనివర్సిటీల వివాదం పూర్తిగా సమసిపోకముందే తాజాగా మరికొన్ని ప్రైవేటు జూనియర్ కాలేజీలు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మభ్యపెడుతున్నాయి. ప్రభుత్వం నుంచి కాలేజీకి కనీస అనుమతులే కాదు అకడమిక్ క్యాలెండర్ కూడా విడుదల కాక ముందే అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించి, ఫీజుల రూపంలో రూ.లక్షలు వసూలు చేస్తున్నాయి. అంతేకాదు ఆయా భవనాలకు అకాడమీ బోర్డులు తగిలించి గుట్టుగా జూనియర్ కాలేజీల పేరుతో అడ్మిషన్లు సేకరిస్తుండటం వివాదాస్పదంగా మారింది. పలు కాలేజీలు హైదరాబాద్ జిల్లాలో అనుమతులు పొంది.. రంగారెడ్డి జిల్లాలో తరగతులు నిర్వహిస్తున్నాయి. షిఫ్టింగ్ అనుమతులు పొందకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులకు విషయం తెలిసీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై విమర్శ లు వెల్లువెత్తుతున్నాయి. ప్రైవేటు కాలేజీల ఆగడాలను అడ్డుకోకపోగా..పరోక్షంగా వారికి సహకరిస్తున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

అనుమతులు రాక ముందే..

ఏటా విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పలు యాజమాన్యాలు కొత్త కాలేజీ గుర్తింపు కోసం ఇంటర్మీడియెట్ బోర్డుకు దరఖాస్తు చేసుకుంటాయి. వీటిలో ఇప్పటికే ప్రభుత్వం నుంచి ఒకటి, రెండు బ్రాంచ్‌లకు అనుమతులు పొందిన కాలేజీలు..అదనంగా మరికొన్ని బ్రాంచ్‌ల ఏర్పాటుకు అనుమతి కోరతాయి. బోర్డు అధికారులు యాజమాన్యాలు ఏర్పాటు చేయాలని భావించిన కాలేజీ భవనం, బోధన, బోధనేతర సిబ్బంది, ప్రయోగశాలలు, ఆటస్థలం, మౌలిక సదుపాయాలు, స్థానిక సంస్థలు, ఫైర్, ఇతర శాఖల నుంచి పొందిన ఎన్‌ఓసీలను పరిశీలించి అన్నీ సవ్యంగా ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాతే ఆయా కాలేజీలకు గుర్తింపును మంజూరు చేస్తుంటారు. జిల్లాలో ఇవేవీ లేకుండా కొన్ని యాజమాన్యాలు ఏకంగా అడ్మిషన్లు స్వీకరిస్తుండటం గమనార్హం. వనస్థలిపురం బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్‌కు ఎదురుగా ఉన్న ఓ కాలేజీ యాజమాన్యంతో పాటు హయత్‌నగర్ భాగ్యలత సహా మరో రెం డు ప్రాంతాల్లో కాలేజీలు నిర్వహిస్తున్న యాజమాన్యం ఆకర్షణీయమైన బ్రోచర్లతో విద్యార్థులను మభ్యపెట్టి గుట్టుగా అడ్మిషన్లు సేకరిస్తోంది. అకాడమీ బోర్డులు తగిలించిన భవనాల్లో జూనియర్ కాలేజీలు నిర్వహిస్తున్నట్లు ప్రచారం చేస్తున్నా.. పట్టించుకునే నాథుడే లేడు.

అధ్యాపకులకు టార్గెట్లు

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీలు 3,183 వరకు ఉన్నాయి. వీటిలో ఒక్క రంగారెడ్డి జిల్లా పరిధిలోనే 18 ప్రభుత్వ, 163 ప్రైవేటు జూనియర్ కాలేజీలు ఉన్నాయి. ప్రభుత్వ రెసిడెన్షియల్, మోడల్ కాలేజీలు మరో 60 వరకు ఉన్నాయి. 2022-23 విద్యా సంవత్సరంలో ఫస్టియర్‌లో 68,289 మంది, సెకండియర్‌లో 53,050 మంది అడ్మిషన్లు పొందారు. ఇటీవలే ఇంటర్‌తో పాటు టెన్త్ ఫలితాలు విడుదలయ్యాయి. వచ్చే విద్యా సంవత్సరం అడ్మిషన్లు పూర్తి చేసుకునేందుకే పలు ప్రైవేటు యాజమాన్యాలు అడ్డదారులు తొక్కుతున్నాయి. అధ్యాపకులకు టార్గెట్లు ఇవ్వడంతో పాటు పీఆర్‌ఓల పేరుతో ప్రత్యేక మార్కెటింగ్ టీమ్‌లను రంగంలోకి దించాయి. ఇటీవలే టెన్త్ పాసైన విద్యార్థుల ఇళ్లకు స్వయంగా వెళ్లి అడ్మిషన్లు సేకరిస్తున్నారు. ఎలాగైనా టార్గెట్లు పూర్తి చేయాలని వందశాతం ఫలితాలు, ఎంఎసెట్, నీట్ కోచింగ్‌పేరుతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మభ్యపెడుతున్నారు. తీరా కొత్త బ్రాంచ్‌లకు అనుమతులు రాకపోవడంతో మదర్ బ్రాంచుల పేరుతో పరీక్షలు రాయిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులు నష్టపోవాల్సి వస్తోంది.

చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన వెలువడక ముందే పలు ప్రైవేటు కాలేజీలు అడ్మిషన్లు స్వీకరిస్తున్నాయి. ఆకర్షణీయమైన బ్రోచర్లు ముద్రించి విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయి. ఆయా కాలేజీలపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశాం.

– మాసారం ప్రేమ్‌కుమార్, అధ్యక్షుడు, సీజేఎస్

ఇప్పటి వరకు ఫిర్యాదు రాలేదు

గుర్తింపు కోసం కొన్ని కాలేజీలు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాయి. ప్రస్తుతం అవి పరిశీలనలో ఉన్నాయి. గుర్తింపు పొందకుండా అడ్మిషన్లు స్వీకరిస్తున్న కాలేజీలపై ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. ప్రభుత్వం అకడమిక్ క్యాలెండర్ విడుదల చేసే వరకు అడ్మిషన్లు చేపట్టొద్దు. అలా చేపట్టే కాలేజీలపై చర్యలు తీసుకుంటాం.

– వెంక్యనాయక్, ఇంటర్ బోర్డు జిల్లా అధికారి



అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

నేడు ఫాక్స్‌కాన్‌కు భూమిపూజ

- భారీగా తరలిరండి
- జిల్లా ప్రజలకు మంత్రి సబిత పిలుపు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అంతర్జాతీయ దిగ్గజ కంపెనీ ఫాక్స్‌కాన్ సంస్థ జిల్లాలో తన కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతోందని, సోమవారం ఉదయం మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా భూమిపూజ నిర్వహిస్తున్నట్లు మంత్రి సబితారెడ్డి ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి జిల్లా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. మొదటి దశలో రూ.1,656 కోట్లతో 196 ఎకరాల్లో ఫాక్స్‌కాన్ సంస్థ తన ఉత్పత్తులను ప్రారంభిస్తుందని వెల్లడించారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో దేశంలోకి వచ్చిన అతి పెద్ద పెట్టుబడుల్లో ఇది అత్యంత ముఖ్యమైందని పేర్కొన్నారు. ఈ సంస్థ పూర్తి స్థాయిలో తన ఉత్పత్తులను ప్రారంభిస్తే లక్ష మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయని మంత్రి తెలిపారు. ఒకే సంస్థ ద్వారా ఇంత మందికి నేరుగా ఉద్యోగాలు లభించడం అరుదైన విషయమని ఆమె పేర్కొన్నారు.

జిల్లా రూపురేఖలు మారుతున్నాయి

జిల్లాలో రూ.64 వేల కోట్ల పెట్టుబడి లక్ష్యంతో 20,000 ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తున్న విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఫార్మాసిటీలో పూర్తి స్థాయిలో పరిశ్రమలు ఏర్పాటైతే 5.60 లక్షల మందికి ఉపాధి కలుగుతుందని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో పారిశ్రామిక రంగానికి నవ శకం ప్రారంభమైందన్నారు. ఇప్పటికే జిల్లాలో ఫ్యాబ్ సిటీ, హార్డ్‌వేర్ పార్క్, ఐటీ టవర్స్, పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేసుకున్నామని, వీటి ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయని మంత్రి తెలిపారు. నూతన పరిశ్రమలతో జిల్లా రూపురేఖలు మారిపోనున్నాయన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

ఇబ్రహీంపట్నం రూరల్: ఫాక్స్‌కాన్ ఏర్పాటుకు సోమవారం ఉదయం భూమిపూజ అనంతరం నిర్వహించే బహిరంగసభకు పెద్ద సంఖ్యలో పార్టీశ్రేణులు, ప్రజలు హాజరుకావాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఏర్పాట్లను ఆదివారం అధికారులు, ఫాక్స్‌కాన్ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. రాష్ట్ర ఐటీ, ఈసీ డైరెక్టర్ సుజయ్, టీఎస్ఐఐసీ సీఈఓ మధుసూదన్, ఫాక్స్‌కాన్ తెలంగాణ మేనేజర్ బ్రయన్‌కోర్, డీసీపీ శ్రీనివాస్‌తో చర్చించారు. ఏడాదిలో ఉత్పత్తిని ప్రారంభించనున్న ఫాక్స్‌కాన్‌లో 35 వేల మందికి ఉపాధి లభించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. మహిళలు, యువతకు నైపుణ్య శిక్షణనిచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు, టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ రవి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, కాసాని జ్ఞానేశ్వర్ తదితరులు

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడుదాం

షాద్‌నగర్: హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటం చేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, స్థానిక ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన బహుజన వీరుడు పండుగ సాయన్న విగ్రహాన్ని ఆదివారం వారు ఆవిష్కరించారు. అనంతరం ముదిరాజ్ మహాసభ నియోజకవర్గ అధ్యక్షుడు అంచె రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో వారు మాట్లాడారు. పార్టీలు, జెండాలు ఏవైనా ముదిరాజ్‌ల ప్రయోజనాలే తమకు ముఖ్యమని అన్నారు. హక్కుల సాధన కోసం తెగించి కొట్లాడుదామని పిలుపునిచ్చారు. నాటి నిరంకుశ నిజాం పాలనను ఎదురించి సరికొత్త బహుజన రాజ్యాన్ని స్థాపించేందుకు పండుగ సాయన్న ఎంతో కృషి చేశారని కొనియాడారు. వీరత్వాన్ని ప్రదర్శించిన ఆయన జీవిత చరిత్ర గురించి నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆ మహనీయుడిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని, ఆశయ సాధన కోసం కృషి చేయాలని అన్నారు. అంతకుముందు పట్టణంలో రైల్వే స్టేషన్ నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ముదిరాజ్ సంఘం నాయకులు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

సారూ.. కాస్త చూడరూ!

- ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ల విస్తరణలో నిర్లక్ష్యం
- క్షేత్రస్థాయిలో కొరవడిన పర్యవేక్షణ
- రూ.380 కోట్లతో రహదారులు, సైకిల్‌ట్రాక్ నిర్మాణం
- పనుల్లో నాణ్యతను పరిశీలించే వారే కరువు



సాక్షి, సిటీబ్యూరో: ఔటర్‌రింగ్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్ల విస్తరణలో నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. వివిధ మార్గాల్లో చేపట్టిన నిర్మాణ పనులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించకపోవడంతో రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నగరం శరవేగంగా విస్తరిస్తోంది. దీంతో ఔటర్ బయట ఉన్న సర్వీస్ రోడ్లపై రోజురోజుకూ వాహనాల రద్దీ పెరిగిపోతోంది. ఐటీ ఉద్యోగుల రాకపోకలు సైతం పెరగడంతో రోడ్ల విస్తరణ తప్పనిసరిగా మారింది. ఈ క్రమంలో హెచ్‌ఎండీఏ అనుబంధ సంస్థ హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) పలు మార్గాల్లో రోడ్ల విస్తరణ చేపట్టింది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 23 కిలోమీటర్ల సైకిల్ ట్రాక్‌తో పాటు సుమారు రూ.380 కోట్లతో రోడ్ల విస్తరణ చేపట్టారు. నానక్‌రాంగూడ నుంచి తెలంగాణ పోలీస్ అకాడమీ వరకు, నార్సింగి నుంచి కొల్లూరు వరకు ప్రస్తుతం ఉన్న రెండు లేన్‌ల రోడ్లను నాలుగు లేన్‌లకు పెంచుతున్నారు. ఇంతవరకు బాగానే ఉంది కానీ ఈ రోడ్ల నిర్మాణంపై హెచ్‌జీసీఎల్ అధికారులు శ్రద్ధ చూపకపోవడంతో వాటి నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. కాంట్రాక్టర్లు నాసిరకం వస్తువులను వినియోగించేందుకు అధికారులే ఒక విధంగా అవకాశం కల్పిస్తున్నట్లు ఉందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గత అనుభవాలను విస్మరించారు..

రోడ్ల విస్తరణలో భాగంగా పలు చోట్ల అండర్‌పాస్‌లు, నాలా పనులు చేపట్టాల్సి ఉంది. వర్షపు నీరు రోడ్లపై చేరకుండా చర్యలు తీసుకోవాలి. గతంలో చిన్న గోల్కొండ వద్ద అండర్‌పాస్‌లోకి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరడంతో నెల రోజులకుపైగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సరైన నాణ్య లేకపోవడంతో చాలా చోట్ల రోడ్లు కుంగుతున్నాయి. నానక్‌రాంగూడ నుంచి తెలంగాణ పోలీస్ అకాడమీ వరకు, నార్సింగి నుంచి కొల్లూరు వరకు సుమారు 24 కిలోమీటర్లకుపైగా రూ.కోట్లు వెచ్చించి ప్రస్తుతం ఈ రోడ్లను నిర్మిస్తున్నారు. గత అనుభవాలు కళ్ల ముందు కనిపిస్తున్నప్పటికీ తాజాగా చేపట్టిన ఈ రోడ్ల నిర్మాణంలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

బాధ్యత హెచ్‌జీసీఎల్‌దే..

ఇటీవల ఔటరింగ్ రోడ్డును ఐఆర్‌బీ సంస్థకు 30 ఏళ్ల లీజుకు ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతో హెచ్‌జీసీఎల్ బాధ్యతలు సర్వీస్ రోడ్లకే పరిమితమయ్యాయి. 158 కిలోమీటర్ల ఔటర్ మార్గంలో ప్రజల అవసరాలకనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అవసరమైన చోట్ల సర్వీస్ రోడ్ల విస్తరణ చేపట్టాల్సి ఉంటుంది. పచ్చదనం పరిరక్షణ కూడా హెచ్‌జీసీఎల్ పర్యవేక్షణలోనే ఉంది. సర్వీస్ రోడ్లకు రెండు వైపులా సుమారు ఒక కిలోమీటర్ విస్తీర్ణంలో మాస్టర్ ప్లాన్ ప్రకారం మౌలిక సదుపాయాల అభివృద్ధి, విస్తరిస్తున్న కాలనీలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేసే గ్రిడ్ రోడ్ల నిర్మాణం వంటివి హెచ్‌జీసీఎల్ చేపట్టాల్సి ఉండగా.. కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రశ్నార్థకమవుతోంది.

ఎక్కడివీ కరెన్సీ కట్టలు?

- ఓ వ్యక్తి ఇంట్లోంచి రూ.1.65 కోట్లు స్వాధీనం
- అగ్ని ప్రమాదంతో బయటపడిన భారీ నగదు
- హవాలా డబ్బుగా పోలీసుల అనుమానం



రాంగోపాల్‌పేట్: నగరంలోని ఓ వ్యక్తి ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదంతో రూ.1.65 కోట్ల నగదు బయటపడిన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి జరిగింది. ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రెజిమెంటల్ బజార్‌లో నివసించే భైరి శ్రీనివాస్ అభిజిత్ ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉత్పత్తి చేసే కంపెనీలో డీజీఎంగా పని చేస్తున్నారు. శనివారం రాత్రి 8 గంటల సమయంలో ఆయన ఇంట్లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. అదే సమయంలో శ్రీనివాస్‌తో పాటు కుటుంబ సభ్యులు విశాఖపట్టణంలో ఉన్నారు. స్థానికులు వెంటనే గోపాలపురం పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని గదిలో ఉండే పనికిరాని వస్తువులు, కొంత చెక్క సామగ్రి మంటల్లో కాలిపోయాయి. మంటలు పూర్తిగా ఆరిపోయిన తర్వాత రాత్రి 12 గంటల సమయంలో గోపాలపురం పోలీసులకు ఇదే ఇంట్లో కోట్ల రూపాయల నగదు ఉందనే సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ ఉన్నతాధికారులకు సమాచారం అందించి ఇంటిని స్థానికులు, పోలీసులతో పాటు బంధువుల సమక్షంలో తెరిచారు. మొదటి అంతస్తులోని బెడ్రూంలో గాలించారు. మంచం కింద, అల్మారా తదితర ప్రాంతాల్లో గాలించగా రూ.1.65 కోట్ల నగదు లభించింది. ఇందులో 50 మాత్రమే రూ.2 వేల కరెన్సీ నోట్లు ఉండగా.. మిగతావి రూ.500, రూ.200 నోట్లు ఉన్నాయి. పెద్ద ఎత్తున బంగారు ఆభరణాలు, వెండి సామగ్రిని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాత్రి 2 గంటల సమయంలో నగదును, ఆభరణాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

హవాలా నగదేనా?

పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు హవాలా మార్గంలో తరలించేందుకు ఉన్నదేననే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఓ కంపెనీలో డీజీఎంగా పనిచేసే వ్యక్తి ఇలా ఇంట్లో ఇంత పెద్ద మొత్తంలో నగదు ఇలా ఉంచుకుంటారా? అని పోలీసులు ఆరా తీస్తున్నారు. సాధారణంగా డబ్బు ఇంట్లో ఉండే చాలా భద్రంగా దాచుకుంటారు కానీ.. కేవలం బ్యాగుల్లో, అల్మారాలో నిర్లక్ష్యంగా దాచి ఉంచడంతో ఇవి ఎక్కడికైనా తరలించేందుకు దాచిపెట్టి ఉంటారని, తరచుగా ఇలా డబ్బు తరలించే వాళ్లే ఇలా ఉంచుతారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు భైరి శ్రీనివాస్‌కు ఫోన్ చేస్తే దీనికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు తన వద్ద ఉన్నాయని వచ్చిన తర్వాత అన్నీ చూపిస్తానని ముక్తసరిగా జవాబిచ్చారు. నగదును ఆదాయ పన్ను శాఖ అధికారులకు స్వాధీనం చేస్తామని, అన్ని రకాల పత్రాలు పరిశీలించిన తర్వాత సక్రమంగా సంపాదించినది అని తేలితే వారికి అప్పగిస్తారని ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ తెలిపారు.

ఆది నుంచీ అనుమానాలే..

భైరి శ్రీనివాస్ 10 ఏళ్లుగా ఇదే ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. గత 6 ఏళ్ల క్రితం తాను ఉండే ఇంటితో పాటు పక్కనే ఉండే మరో ఇల్లు కొనుగోలు చేశారు. ఈ రెండు ఇళ్ల సుమారు రూ.3 కోట్ల విలువ చేస్తాయి. శ్రీనివాస్ స్వస్థలం అయిన వైజాగ్‌లో కూడా గత కొద్ది రోజుల క్రితమే విలువైన ఇల్లు నిర్మించినట్లు స్థానికులు చెబుతున్నారు. అనతి కాలంలోనే కోట్ల రూపాయల విలువ చేసే ఆస్తులు ఎలా సంపాదించారని స్థానికులు సందేహాలు వెలిబుచ్చుతున్నారు. హవాలా వ్యాపారం చేస్తున్నారా? అనే అనుమానాలు పోలీసులు వ్యక్తం చేస్తున్నారు.

నడుస్తూ.. సమస్యలు ఆలకిస్తూ

- కొనసాగుతున్న భట్టి పాదయాత్ర



మహిళలతో మాట్లాడుతున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

కొందుర్గు: పీపుల్స్ మార్చ్ కార్యక్రమంలో భాగంగా మండలంలో కొనసాగుతున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్రకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన రైతులు, మహిళలు, విద్యార్థులతో మాట్లాడారు. మండలంలోని ఉమ్మెంత్యాలలో రైతు జైపాల్‌తో సంభాషించారు. రుణమాఫీ చేశారా అని అడగగా ఇంకా కాలేదని తెలిపాడు. అనంతరం భట్టి విక్రమార్క పొలంలోకి వెళ్లి రైతు నుంచి అరక తీసుకొని తోలాడు. కాంగ్రెస్ పాలన వస్తేనే రైతులు సుభిక్షంగా ఉంటారని పేర్కొన్నారు. అనంతరం వడ్రంగి వద్దకు వెళ్లి అతడి మాట్లాడి బాడిసెతో కట్టెను చెక్కే యత్నం చేశాడు. మహిళలతో మాట్లాడగా వారు తమ గ్రామానికి సరిగ్గా బస్సు రావడం లేదని, రోడ్డు బాగాలేదని, పాఠశాలలో ఉపాధ్యాయులు లేక పిల్లలు సరిగ్గా చదవడం లేదని వివరించారు. అనంతరం సాయంత్రం లూర్దునగర్ నుంచి పాదయాత్ర బయలుదేరి కొందుర్గు మండల కేంద్రం నుంచి జిల్లేడ్ చౌదరిగూడ మండలం లాల్‌పహాడ్ మీదుగా వికారాబాద్ జిల్లా పరిగి మండలం తొండుపల్లికి చేరుకుంది.

ఢిల్లీకోటపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

కర్ణాటక ఫలితాలతో కాంగ్రెస్ విజయం ప్రారంభమైందని, రానున్న ఎన్నికల్లో ఇక్కడ తెలంగాణ, అక్కడ ఢిల్లీ కోటపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని భట్టి విక్రమార్క అన్నారు. కేసీఆర్ మాయ మాటలు నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మించి రైతన్నల కాళ్లు కడుగుతామని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, పార్టీ నేతలు ఓబేదుల్లా కొత్వాల్, ఎర్ర శేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్, పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ నాయకత్వం దేశానికి అవసరం


కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రకాశ్

శాసనమండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాశ్

షాద్‌నగర్: కేసీఆర్ నాయకత్వం దేశానికి ఎంతో అవసరమని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ అన్నారు. ఆదివారం షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సమక్షంలో మండలంలోని బూర్గుల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన ప్రకాష్ బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ గొప్ప విజన్ ఉన్న నేత అని అన్నారు. ఆయన నాయకత్వం దేశానికి ఎంతో అవసరం అని అన్నారు. దేశ ప్రజలంతా కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, రానున్న రోజుల్లో దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నేతలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. పార్టీలో చేరిన వారిలో సీ ఎల్లయ్య, బీ రవీందర్, రమేష్, జంగయ్య, నర్సింలు, మల్లయ్య, రమణ, జంగయ్య, రాజ్‌కుమార్, బాలయ్య, వెంకటయ్య, పోచయ్య, జగన్, శ్రీను, యాదగిరి, రాజేందర్, అంజయ్య, సాయిలు, శ్రీనివాస్, బీ రమేష్, గణేష్, ఎల్ రవీందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయకులు రాఘవేందర్‌గౌడ్, వీరేశం పాల్గొన్నారు.

పంచ్ పడితే పతకమే


ప్రత్యర్థితో తలపడుతున్న సోనియా

- కరాటేలో రాణిస్తున్న గిరిపుత్రిక సోనియా
- జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో మెడల్స్

కడ్తాల్: జాతీయ, అంతర్జాతీయ కరాటే పోటీల్లో రాణిస్తూ, అందరి చేత శభాష్ అంటూ జేజేలు అందుకుంటోంది.. గిరిపుత్రిక సోనియా.. లక్ష్యాన్ని సాధించాలనే ఆశయం, పోటీ ఏదైనా గెలవాలనే పట్టుదల, ఆత్మ విశ్వాసం సోనియా సొంతం. మండలంలోని గోవిందాయిపల్లి తండాకు చెందిన సభవత్ గేండా నాయక్, బుజ్జి దంపతుల మూడో సంతానం సభవట్ సోనియా. తల్లిదండ్రులు కూలి పనులు చేస్తారు. సోనియా చదువుతో పాటు, కరాటేలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. మూడో తరగతి చదువుకునే సమయంలోనే మాస్టర్ వెంకటేశ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందింది. సోనియాలోని పట్టుదలను చూసిన మాస్టర్ ప్రత్యేక శిక్షణ ఇచ్చాడు. మొదటి సారిగా 2012లో మహబూబ్‌నగర్‌లో జరిగిన ఆల్ ఇండియా కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని పతకం సొంతం చేసుకుంది. అప్పటి నుంచి పలు చోట్ల జరిగిన పోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధిస్తూ వస్తోంది. సోనియా బరిలోకి దిగిందంటే పతకాలు వరించాల్సిందే అన్నంత పేరు తెచ్చుకుంది.

ఓ వైపు పతకాలు.. మరోవైపు కోచ్‌గా..

ఓ వైపు సోనియా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొంటునే మరో వైపు తాను నేర్చుకున్న విద్యను పది మందికి పంచాలనే తపనతో శిక్షణ ఇస్తోంది. మరి కొందరిని కరాటేలో తీర్చి దిద్దుతోంది. అంతేకాకుండా కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తోంది. సోనియా ప్రస్తుతం డిగ్రీ ప్రథమ సంవత్సరం ఇటీవలే పూర్తి చేసింది.

సాధించిన పతకాలు

- 2012లో మహబూబ్‌నగర్‌లో జరిగిన ఆల్ ఇండియా కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో విజేతగా నిలిచింది.
- 2013లో కొందుర్గులో విక్టోరియా బుడోఖాన్ ఆల్ ఇండియా కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించింది.


సాధించిన పతకాలతో సోనియా

- 2014లో కొస్గిలో జరిగిన 7వ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో గ్రాండ్ చాంపియన్ షిప్‌ను సొంతం చేసుకుంది.
- 2015లో వరంగల్‌లో జరిగిన 6వ జాతీయ స్థాయి షోటోకాన్ కరాటే పోటీల్లో విజేతగా నిలిచింది.
- 2016లో పటాన్ చెరువులో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో విజయం సాధించింది.
- 2017లో హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో బంగారు పతకాన్ని దక్కించుకుంది.
- 2018లో కరీంనగర్‌లో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో గోల్డ్‌మెడల్ సొంతం చేసుకుంది.
- 2019లో వరంగల్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో చాంపియన్‌గా నిలిచింది.
- 2020 విశాఖలో జరిగిన ఆసియా కరాటే పోటీల్లో విజేతగా నిలిచింది.
- 2021లో గోవాలో జరిగిన కరాటే పోటీల్లో టైటిల్ తోపాటు బంగారు పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది.
- 2022లో మలేషియాలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో బంగారు పతకం సాధించింది.

స్పోర్ట్స్‌గా గుర్తించాలి

ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆపద సమయంలో, ఇతరులకు సాయం చేయడానికి ఉపయోగపడుతుంది. కరాటేను స్పోర్ట్స్‌గా గుర్తించాలి. ప్రస్తుతం విదేశాల్లో కరాటేకు మంచి గుర్తింపు ఉంది. మన దేశంలోనూ ప్రాధాన్యత ఇవ్వాలి.

– సోనియా, కరాటే క్రీడాకారిణి, కోచ్

నంబర్ లేకుంటే కటకటాలే!

- వాహనాల నంబర్ ప్లేట్ల ట్యాంపరింగ్‌పై సీరియస్
- స్పెషల్ డ్రైవ్ చేపడుతున్న రాచకొండ ట్రాఫిక్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: నెంబర్ ప్లేట్ ట్యాంపరింగ్‌పై రాచకొండ ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం సమయాల్లో స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. నెంబర్ ప్లేట్ సరిగా లేకపోయిన, కనిపించకుండా ప్లేట్‌ను వంచినా, మాస్క్ వేసినా, అస్పష్ట నెంబర్ ప్లేట్‌తో నడిపినా, ట్యాంపరింగ్ చేసినా కేంద్ర మోటారు వాహన చట్టంసెక్షన్ 192కింద కేసులు నమోదు చేస్తున్నారు. చార్జిషీట్లు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు రాచకొండ పరిధిలో 49 వేలకు పైగా నెంబర్ ప్లేట్ టాంపరింగ్ కేసులు నమోదయ్యాయి.

పునరావృతమైతే అంతే..

కొత్త వాహనాలు 30 రోజుల్లోగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని రాచకొండ జాయింట్ సీపీ సత్యనారాయణ తెలిపారు. నెంబర్ ప్లేట్ ట్యాంపరింగ్‌తో తొలిసారి చిక్కిన వాహనదారులు సరిచేసుకోవాలని, ఇదే తప్పు పునరావృతం ఐతే కేసులు నమోదు చేస్తామన్నారు.

ఆరుగురికి జైలు

నెంబర్ ప్లేట్ ట్యాంపరింగ్ చేస్తూ రెండోసారి పట్టుబడిన ఆరుగురు నిందితులకు న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. వారి వివరాలు:

- మాస్కు సాయి కుమార్: ఒక రోజు జైలు, రూ.3 వేలు జరిమానా
- వంగాల వెంకటేష్: ఒక రోజు జైలు, రూ.3 వేలు జరిమానా
- పి.దర్వేష్ ఖాన్: మూడు రోజులు కారాగారం, రూ.5 వేలు ఫైన్
- జి.శ్రీనివాస్: రెండు రోజులు కమ్యూనిటీ సర్వీస్, రూ.3 వేలు జరిమానా
- వై.మంజుల: రూ.5 వేలు జరిమానా
- రాసమల్ల శివ: రూ.5 వేలు ఫైన్

ధర్మగిరి బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

శంషాబాద్: పట్టణంలోని ధర్మగిరి దేవాలయంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హారతి, హోమం, పల్లకీ సేవ పారాయణం, సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాబాను దర్శించుకున్నారు. ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ట్రస్టీ శివదత్తసాయి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చెరువులో వ్యక్తి మృతదేహం

పహాడీషరీఫ్: చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి చెరువులో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని చూసిన గ్రామానికి చెందిన అబ్బు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు స్థానికుల సాయంతో మృతదేహాన్ని బయటికి తీశారు. మృతుడి వయస్సు 35 – 40 ఏళ్ల నడుమ ఉంటుందని, ఒంటిపై నలుపు, తెలుపు రంగులో షర్ట్, మెరూన్ కలర్ డ్రాయర్ ధరించి ఉన్నాడు. చెరువు ఒడ్డుపై బ్లాక్ కలర్ నైట్ ప్యాంట్, నీలం రంగు ప్యారాగాన్ చెప్పులు ఉన్నాయి. ఈ ఆనవాళ్లు సరిపోలిన వారు కనిపించకపోతే పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్, లేదా సెల్ నంబర్ 87126 62367లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

కొత్తూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కొత్తూరు మున్సిపల్ తిమ్మాపూర్‌లో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాల మేరకు.. పశ్చిమబెంగాళ్‌కు చెందిన గోపాల్(38) ఉపాధి కోసం ఐదు రోజుల క్రితం కొత్తూరుకు వచ్చాడు. తెల్లవారుజామున కాలినడకన తిమ్మాపూర్ నుంచి శంషాబాద్ వైపునకు వెళుతుండగా వెనక నుంచి వచ్చిన వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

కుక్కను తప్పించబోయి..

పహాడీషరీఫ్: కుక్కను తప్పించబోయి ఓ ద్విచక్ర వాహనదారుడు కిందపడి మృతి చెందిన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ బి.భాస్కర్ తెలిపిన వివరాల


రాములు మృతదేహం

ప్రకారం.. వెంకటాపూర్ హరూన్ కాలనీకి చెందిన సయ్యద్ అన్వర్ కుమారుడు సయ్యద్ షానవాజ్(21) డ్రైవర్. ఆదివారం తెల్లవారుజామున వాదే ముస్తఫా బస్తీలో వలీమా డిన్నర్ ముగించుకొని తన బైక్‌పై వస్తున్నాడు. షాహీన్‌నగర్‌లోని ఓ ఆసుపత్రి వద్దకు రాగానే కుక్క అడ్డం వచ్చింది. దాన్ని తప్పించే క్రమంలో కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని..

చేవెళ్ల: అతివేగంగా వచ్చిన కారు రోడ్డు పక్కన నిలుచున్న వ్యక్తిని ఢీ కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాపూర్‌కు చెందిన రాములు(55) గేదెలు కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే గ్రామ శివారులో గేదెలను మేపేందుకు వెళ్లాడు. కంచెలో గేదెలు మేస్తుండగా హైదరాబాద్ – బీజాపూర్ జాతీయ రహదారి పక్కన నిలబడ్డాడు. నగరం నుంచి అతివేగంతో వచ్చిన కారు రాములు ఢీకొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పోలీసుల కస్టడీలో వజ్రాభరణాల దొంగ

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం.72లోని ప్రశాసన్‌నగర్‌లో మాజీ డీజీపీ ఆనందయ్య నివాసంలో వజ్రాభరణాలు, వెండి వస్తువులు, డాలర్లు దొంగిలించిన కేసులో నిందితుడిని రెండు రోజుల కస్టడీలో భాగంగా విచారించారు. ఈ ఘటనలో సొత్తు రికవరీతో పాటు మరింత సమాచారం రాబట్టేందుకు నిందితుడిని శని, ఆదివారాలు కస్టడీకి తీసుకున్నారు. విచారణ అనంతరం ఆదివారం సాయంత్రం జైలుకు తరలించారు. వివరాల్లోకి వెళ్తే..నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలం చిన్నపొర్ల గ్రామానికి చెందిన అంజప్ప (24) చింతల్‌బస్తీల చేపల వ్యాపారం చేస్తూ జల్సాలకు అలవాటు పడ్డాడు. రోజువారి సంపాదన సరిపోకపోవడంతో దొంగతనాలపై దృష్టి పెట్టాడు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిదిలో శమంతక జ్యువెలర్స్‌లో ఆభరణాలు దొంగిలించగా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బెయిల్‌పై వచ్చిన తర్వాత జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో మాజీ డీజీపీ ఇంట్లోకి ప్రవేశించి 30 తులాల బంగారు ఆభరణాలు, 20 కిలోల వెండి వస్తువులు, డాలర్లు, నగదు తస్కరించాడు. నార్సింగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనానికి పాల్పడి అక్కడి పోలీసులకు చిక్కాడు. జైలులో ఉన్న అంజప్పను జూబ్లీహిల్స్ పోలీసులు కస్టడీకి తీసుకొని సొత్త రికవరీ కోసం విచారణ చేపట్టారు. ప్రశాసన్‌నగర్ దొంగతనం అనంతరం నిందితుడు ఆభరణాలు ఖైరతాబాద్ రైలు పట్టాల పక్కన గుంత తీసి పాతిపెట్టినట్లు చెప్పాడు. వెండి వస్తువులను బంజారాహిల్స్‌లోని శ్మశాన వాటికలో గుంత తీసి భద్రపరిచాడు. డాలర్లను, ఖరీదైన వాచీలను కేర్ ఆస్పత్రి వెనుకాల ఉన్న ఓ పాడుబడ్డ భవనంలో ఉంచాడు. అక్కడి నుంచి యాదాద్రికి దర్శనానికి వెళ్లాడు. వచ్చిన తర్వాత జైలులో పరిచయం అయిన బార్కాస్ పాత నేరస్తుడు అబ్దుల్లాతో జతకట్టి ప్రశాసన్‌నగర్ చోరీలో దాచి న బంగారు బిస్కెట్లు చార్మినార్ వద్ద విక్రయించినట్లు అంగీకరించాడు.

మాతృత్వం ఓ మధుర జ్ఞాపకం



మాట్లాడుతున్న నటి భూమిక చావ్లా

- నటి భూమిక చావ్లా
- ఈషా ఐవీఎఫ్ ఫెర్టిలిటీ సెంటర్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియామకం

బంజారాహిల్స్: 'తల్లిగా ఉండడం వాస్తవంగా ప్రపంచంలోనే అత్యంత కష్టతరమైన పని. కానీ ప్రతి స్త్రీకి మాతృత్వం అనేది ఓ మధుర జ్ఞాపకమే' అని ప్రముఖ బాలీవుడ్ నటి భూమిక చావ్లా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 2 లోని ఈషా ఐవీఎఫ్ ఫెర్టిలిటీ సెంటర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూమికను ఈషా ఐవీఎఫ్ ఫెర్టిలిటీ సెంటర్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించారు. సంతానం కోసం ఆతృతపడే వారికి తమ సంస్థ ద్వారా 'మహిళలకు మాతృత్వం' అనే బహుమతిని అందిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ సందర్భంగా భూమిక మాట్లాడుతూ..మాతృత్వం అనేది ప్రతి స్త్రీకి ఒక సున్నితమైన అంశమని, సంతానలేమికి సంబంధించి సామాజికంగా సమస్యను ఎదుర్కొంటారన్నారు. తాజా సాంకేతికత పరిశోధన ఈ రంగంలో అత్యుత్తమమైన నైపుణ్యాలు ఈషా ఐవీఎఫ్ సొంతం చేసుకుందన్నారు. మానసిక మద్దతును అందిస్తుందన్నారు. సంస్థ వ్యవస్థాపకురాలు, ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ చందనా లక్కిరెడ్డి మాట్లాడుతూ..సంతానలేని సమస్య రోజురోజుకి ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర ఆందోళన కలిగించే అంశంగా మారిందన్నారు. ప్రతి ఆరుగురిలో ఒకరు తమ జీవితకాలంలో ఈ సమస్యను ఎదుర్కొంటున్నారని, ఇది జనాభాలో 17.5 శాతం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీవిద్య పర్వతనేని, డాక్టర్ చాందిని చింత పాల్గొన్నారు.

'ఐదు తరాలు' పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణలో నర్సింహారెడ్డి తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రముఖ ఉద్యమకారుడు గులాబీల మల్లారెడ్డి రచించిన కథల సంపుటి 'ఐదు తరాల' అనే పుస్తకాన్ని ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ సాహితీవేత్త, అడిషనల్ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం నర్సింహారెడ్డి మాట్లాడుతూ... భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ నుంచి విముక్తి కోసం తమ ఐదు తరాలకు చెందిన వారసులు ఎలా పోరాటం చేశారో ఈ పుస్తకం ద్వారా తెలియజేయడం స్ఫూర్తిదాయకం అన్నారు. ఇలాంటి పోరాటపటిమ ఉన్న నాయకుల స్ఫూర్తి భవిషత్ తరాలవారికి ఎంతో అవసరం అన్నారు. పుస్తక రచయిత గులాబీల మల్లారెడ్డి మాట్లాడుతూ... మాకు సంబంధించిన ఐదు తరాల వారు దొరతనానికి, దోపిడీకి, భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తుచేశారు. ప్రముఖ సాహితీవేత్త కె.ఆనందాచారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అతిథులుగా మంత్రి శ్రీదేవి, రాపోలు సుదర్శన్, బొజ్జా భిక్షమయ్య, ప్రమోద్ ఆవంచ, వేముల ప్రభాకర్, గుడిపాటి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

అన్నదమ్ముల హుక్కా దందా

- గుట్టురట్టు చేసిన పశ్చిమ మండల టాస్క్‌ఫోర్స్

సాక్షి, సిటీబ్యూరో: టోలీచౌకి ప్రాంతంలో గుట్టుగా హుక్కా దందా సాగిస్తున్న అన్నదమ్ములకు పశ్చిమ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెక్ చెప్పారు. ది సీషా ఫ్యాక్టరీ కేఫ్ పేరుతో నడుస్తున్న హుక్కా పార్లర్‌పై దాడి చేసి ఇరువురినీ అరెస్టు చేసినట్లు ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు ఆదివారం వెల్లడించారు. పాత బస్తీలోని కాలాపత్తర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ అర్షద్ హుస్సేనీ, సయ్యద్ ఒబేద్ హుస్సేనీ అన్నదమ్ములు. తేలిగ్గా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో వీళ్లు కాకతీయ నగర్‌లో ఈ హుక్కా పార్లర్ ఏర్పాటు చేశారు. కొన్నాళ్లుగా గుట్టుగా సాగుతున్న దీనికి వచ్చే యువతకు వివిధ రకాలైన ఫ్లేవర్స్‌తో కూడిన పొగాకు ఉత్పత్తుల హుక్కా అందిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఈ పార్లర్‌లో భారీగా పొగాకు ఉత్పత్తులతో పాటు మండే స్వభావం ఉన్న వాటినీ గుర్తించారు. ఓ భవనం రెండో అంతస్తులో ఈ పార్లర్ ఉందని, అందులో ఉన్న ఉత్పత్తుల కారణంగా అగ్నిప్రమాదాలకు ఆస్కారం లేకపోలేదని పోలీసులు చెప్తున్నారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితులను లంగర్‌హౌస్ పోలీసులకు అప్పగించారు.

గోవా నుంచి మద్యం తెస్తే కేసులు

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో స్పెషల్ డ్రైవ్

రాజేంద్రనగర్: గోవాతో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశాల నుండి మద్యాన్ని తీసుకొచ్చిన వారిపై ఎక్సైజ్ శాఖ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామని శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు వెల్లడించారు. గత వారం రోజులుగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు వెల్లడించారు. గోవా నుండి మద్యాన్ని తీసుకొస్తున్న వారిని గుర్తించి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసులు నమోదు చేశామన్నారు. గోవా నుండి మద్యం బాటిళ్లు తీసుకురావడం నేరమన్నారు. గోవాకు వెళ్లిన వారు తమ వెంట బాటిళ్లు తీసుకొస్తున్నారని తమకు సమాచారం ఉందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు వెల్లడించారు. గోవాకు వెళ్లిన వారు తమ వెంట మద్యం బాటిళ్లను తీసుకురావొద్దని సూచించారు. ఎవరైనా తీసుకొస్తే వారిని గుర్తించి ఎక్సైజ్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. ఒక్క బాటిల్ ఉన్నా కేసు నమోదు తప్పనిసరి అని స్పష్టం చేశారు. అలాగే ఇతర రాష్ట్రాల నుంచి ఎవరైనా మద్యంను తీసుకొచ్చి ఇక్కడ విక్రయించిన లేదా తమ ఇళ్లల్లో స్టాక్ పెట్టుకున్నా... నేరమన్నారు. రాష్ట్రంలో తయారైన రాష్ట్రంలో విక్రయించే బాటిళ్లను మాత్రమే వినియోగించాలని సూచించారు.


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న పోలీసులు

విదేశీ మద్యం స్వాధీనం

అత్తాపూర్ రాంబాగ్ ప్రాంతానికి చెందిన బి.జనార్దన్ రెడ్డి, అగర్వాల్ వద్ద విదేశీ మద్యం ఉందని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ పోలీసులు వెల్లడించారు. తదుపరి విచారణ నిమిత్తం శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.